క్లుప్తంగా

దివ్యాంగులకు ఇంటి వద్దే విద్య



దివ్యాంగ విద్యార్థితో మాట్లాడుతున్న చంద్రశేఖరెడ్డి

పాకాల : వైకల్యం కలిగిన పిల్లలకు ఇంటి వద్దే విద్య అందిస్తున్నట్టు జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక రైల్వే క్వార్టర్స్, దేశిరెడ్డిపల్లి, పకీరుపేట, గాంధీనగర్, దామలచెరువు, గుట్ట కింద ఇండ్లు, ఉప్పువంక, మచ్చా వీధి, పాగతోట, శ్రీనివాసపురం గ్రామాల్లోని దివ్యాంగ పిల్లలకు ఇంటి వద్ద విద్యను అందించే కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే దామలచెరువు, పాకాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న 3 రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, కెఎస్ఎల్.సుందరి, ఐసీడీఎస్ సీడీపీవో ప్రదీప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రైటింగ్ బోర్డు వితరణ

పాకాల : మండలంలోని తలారిపల్లికి చెందిన బీఎస్పీ చంద్రగిరి అసెంబ్లీ అధ్యక్షుడు జయదేవ్, లీలాకుమారి దంపతులు శనివారం స్థానిక భవిత కేంద్రానికి రైటింగ్ బోర్డు వితరణ చేశారు. తమ కుమారుడు భగత్ కాన్షీ మొదటి పుట్టినరోజు సందర్భంగా భవిత కేంద్రంలో కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఎంఈవో బాబ్జి, ఐఈఆర్‌టీలు మునికృష్ణ, కెఎస్ఎల్.సుందరి, ఐ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

తిరుపతి అర్బన్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్ డిమాండ్ చేశారు. వారు శనివారం కలెక్టరేట్‌లో ఏపీఐఐసీ ఆఫీస్ ఉద్యోగులతో కలిసి జిల్లా సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

టోల్‌గేట్‌లో భక్తులకు తప్పని తిప్పలు

తిరుమల : శ్రీవారి దర్శనార్థం దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వాహనాల్లో వస్తున్న భక్తులకు టోల్ గేట్‌లో తిప్పలు తప్పడం లేదు. వారం రోజులుగా ఫాస్ట్ ట్యాగ్ సిస్టం మొరాయించడంతో టోల్ ఫీజులు చెల్లింపులో భక్తుల అవస్థలు వర్ణనాతీతం. టోల్ రుసుము నగదు రూపంలో చెల్లిస్తాంటే అధికారులు, సిబ్బంది అంగీకరించకుండా ఫోన్ పే ద్వారానే చెల్లించాలని ఆదేశిస్తున్నారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా సిస్టమ్ పనిచేయకపోయినా మరమ్మతులు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు, సిబ్బంది చొరవతీసుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరుకుంటున్నారు.

మాడ వీధుల్లో షెడ్ల ఏర్పాటుకు సర్వే

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం మాడవీధుల్లో మూవబుల్ షెడ్ల ఏర్పాటుకు శనివారం సాంకేతిక సర్వే చేపట్టారు. బ్రహ్మోత్సవాలు, వాహన సేవలను భక్తులు వీక్షించేందుకు అనుకూలంగా శాశ్వత, మూవబుల్ షెడ్లు ఏర్పాటు చేసేందుకు టీటీడీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

స్టెమ్‌డీ సదస్సుకు అల్లాడి

తిరుపతి తుడా: కోల్‌కతా స్టెమ్ డీ ఆధ్వర్యంలో కోల్‌కతా ది పార్క్ హోటల్ వేదికగా జరగనున్న 11వ వార్షిక సదస్సుకు స్విమ్స్ వర్సిటీ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్‌కు ఆహ్వానం అందింది. ఆయన సొసైటీ ఆఫ్ ట్రోఫికల్ మెడిసిన్ ఇన్‌ఫెక్టియస్ డిసీస్ ఇన్ ఇండియా అనే సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొననున్నారు.

ఎస్వీయూలో వికసిత్ భారత్ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శ్రీనివాస ఆడిటోరియంలో ఇండియా ఎస్ ఎమర్జింగ్ గ్లోబల్ పవర్–ది జర్నీ టువోర్డ్స్ వికసిత్ భారత్ 2047 అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతోంది. శనివారం రెండో రోజు పలు ప్రాంతాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు

తిరుపతి తుడా : రుయాలో ల్యాబ్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్, డయాగ్నొస్టిక్స్ సెంటర్ భవనంలోకి ల్యాబ్‌ను మార్చేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన శనివారం ఏపీఎంఐడీసీ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన గదులను గుర్తించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

తిరుపతి కల్చరల్: ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

అనుబంధ రంగాలతో అధిక లాభాలు



పిగ్ పార్మింగ్ శిక్షణనిస్తున్న అధ్యాపకులు, హాజరైన పలు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులు

వ్యవసాయంతో పోలిస్తే అనుబంధ రంగాల్లో అధిక ఆదాయం వస్తోంది. వీటికి సీజన్లు, వాతావరణ పరిస్థితులతో అవసరం ఉండదు. దీంతో ఆయా రంగాలకు ఆదరణ పెరుగుతోంది. పాడి పరిశ్రమ, కోళ్లు, జీవాలు, కుందేళ్లు, పందుల పెంపకం తదితరాలు గతంలో కులవృత్తులుగా ఉన్నా పెరుగుతున్న మార్కెట్ అవసరాలను అందిపుచ్చుకుని నేటితరం వీటిని పరిశ్రమస్థాయికి తీసుకువచ్చింది. ప్రస్తుతం ఎక్కువ మంది సీమ పందుల పెంపకంతో ఏడాదికి రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. ఇందులో భాగంగా ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఔత్సాహిక రైతులు, యువత, మహిళలకు సీమ పందుల పెంపకంపై శిక్షణా తరగతులు ఇచ్చారు. –తిరుపతి సిటీ

మాంసాహార ఉత్పత్తులకు డిమాండ్ ఉంది



నేను సాధారణ పంటలు సాగు చేస్తున్నాను. ప్రస్తుతం మార్కెట్‌లో మాంసాహార ఉత్పత్తులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా సీమ పందులకు డిమాండు పెరిగింది. నార్త్ ఇండియాతో పాటు విదేశీ మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. దీంతో నేను పిగ్ పార్మింగ్ చేపట్టాలని నిర్ణయించుకున్నాను.

– గోపాలక్రిష్ణ, రైతు, కర్ణాటక

పరిశ్రమ స్థాపనకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది



నేను గృహిణిని. సీమ పందులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండు ఎక్కువగా ఉంది. శిక్షణలో పిగ్ ఫార్మింగ్ నిర్వహణ, పోషణ, వ్యాధుల నివారణ చర్యలు, షెడ్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఎంతో లాభసాటి పరిశ్రమ కావడంతో ఆ రంగంలో ప్రవేశించనున్నాను.

–బి.శివజ్యోతి, కదిరి, అనంతపురం

డిమాండు అధికంగా ఉన్న రంగమని....



సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా పిగ్ పార్మింగ్‌లో రాణిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని నేను పిగ్ పార్మింగ్ ఏర్పాటు చేయాలని శిక్షణకు హాజరయ్యారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– శివప్రసాద్, కర్నూలు జిల్లా

స్వయం ఉపాధితో పాటు...ఉపాధి కల్పనకు అవకాశం



వాతావరణ ఒడుదుడుకులతో సంబంధం లేకుండా లాభాలు ఆర్జించి పెట్టేది పాడి పరిశ్రమ. ప్రస్తుతం సీమ పందుల మాంసానికి డిమాండ్ ఉంది. ఎంతో మంది పిగ్ ఫార్మింగ్‌తో ఆదాయం పొందుతున్నారు. మా వ్యవసాయ క్షేత్రంలో పిగ్ పార్మింగ్ ఏర్పాటు చేయాలని శిక్షణ తీసుకున్నాను.

– డి.ప్రమోదిని, నర్సీపట్నం, వైజాగ్

శాస్త్రీయ పద్ధతులతో అధిక ఆదాయం



వ్యవసాయ అనుబంధ రంగాల్లో పిగ్ పార్మింగ్ ఎంతో మేలు. నేడు యవత పిగ్ పార్మింగ్‌పై మక్కువ చూపుతున్నారు. వర్సిటీలో శిక్షణ తీసుకున్న యువ రైతులు ఏడాదికి రూ.20 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చు.

– ప్రొఫెసర్ కే సుజాత, పిగ్ పార్మింగ్ శిక్షణ ఆర్గనైజర్, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయంలో శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయలో శనివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకాలు చేశారు. అనంతరం గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణ చేశారు. డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు తన దేవేరులతో కలిసి తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు.

చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



కర్ణం చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారు. పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి సచివాలయం ముందున్న కర్ణం చెరువులో శనివారం యంత్రాల సహాయంతో అక్రమార్కులు మట్టిని తరలించారు. ఈ విషయంపై స్థానికులు అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదు. హిటాచి, 3 టిప్పర్ల సహాయంతో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి సిటీ : జాతీయ సైన్స్ డే సందర్భంగా కర్ణాటక రామయ్య వర్సిటీలో 20, 21 తేదీల్లో అన్వేషణ పేరుతో సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు ఎస్వీయూ వీసీ అప్పారావు తెలిపారు. ఆయన శనివారం రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందులో పాల్గొనే ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

రేపు వర్సిటీలో వేమన సదస్సు

ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా సోమవారం వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వేమన శూన్యవాదంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి, బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ కేవీ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషాభిమానులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

భర్త నుంచి రక్షణ కల్పించండి

తిరుపతి కల్చరల్: తప్పుడు పనులు చేయనని చెప్పినందుకు భర్త తనపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టాడని రామచంద్రాపురం మండలం కుప్పం బాదూరు కొత్తకండ్రిగకు చెందిన మహిళ వాపోయారు. ఆమె శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తన భర్త మునిరత్నంరెడ్డి పెయింటర్‌గా పనిచేసేవాడని, కరోనా సమయంలో పనిలేకపోవడంతో డబ్బుల కోసమని తనతో చామెట్(చిల్ చాట్) యాప్‌లో కాల్స్ మాట్లాడి రూ.18 లక్షలు సంపాదించినట్టు తెలిపారు. ఇప్పుడు ఆ పని చేయనని చెప్పడంతో భర్త దాడి చేశాడని తెలిపారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి తన ఫొటోలు, వీడియోలను షేర్ చేయడంతో తనను ఇంటి నుంచి వెళ్లగొట్టారని వాపోయారు. రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఉన్నతాధికారులు తనకు భర్త నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

కార్మికులను కొండ దించుతామనడం దుర్మార్గం

– కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్



టీటీడీ పరిపాలన భవనం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

తిరుపతి కల్చరల్: అన్యమతం పేరుతో కొండపైన పని చేస్తున్న 4,500 మంది కార్మికులను తిరుమల కొండ నుంచి దించుతామని చెప్పడం దుర్మార్గమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ ధ్వజమెత్తారు. ఆయన శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తిరుమలలో సుమారు 5 వేల మందికి పైగా పలు విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో 90 శాతం మంది దళితులని, ప్రతి ఆదివారమూ 4,500 మంది చర్చికి వెళుతున్నారని తెలిపారు. అన్యమతం పేరుతో వారిని కొండ నుంచి దింపే దమ్ము ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో టీటీడీ ఈవో శ్యామలరావు తప్పు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చెవిరెడ్డి పేరు చెరిపేందుకు మీరెవరు?

- పుదిపట్లలో మహిళల ఆగ్రహం
- పోలీసులు సర్ది చెప్పినా వినని వైనం

తిరుపతి రూరల్ : మండలంలోని పుదిపట్ల పంచాయతీలో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలపై చెవిరెడ్డి పేరు చెరిపేందుకు వచ్చిన పెయింటర్లను శనివారం మహిళలు అడ్డుకున్నారు. ముందుగా అరుంధతిపురంలో సిమెంటు బెంచీలకు రంగులు వేయడానికి వచ్చిన పెయింటర్లపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుదిపట్లకు వెళ్లే మెయిన్ రోడ్డు వద్ద బెంచీలకు రంగులు వేస్తుండగా అక్కడ కూడా మహిళలు అడ్డుకున్నారు. తమ గ్రామంలో సిమెంటు బెంచీలకు రంగులు వేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. దీంతో పెయింటర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని గ్రామస్తులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. మా గ్రామంలో రంగులు వేయడానికి మీరు ఎవ్వరు? చేతనైతే నాలుగు బెంచీలు ఇవ్వమనండి.. అంతేగానీ ఇలా చెవిరెడ్డి ఏర్పాటు చేసిన బెంచీలకు పేర్లు చెరపడం సరికాదన్నారు. 'మీకు కాంట్రాక్టు ఇచ్చిన వారికి చెప్పండి.. ఇలా చేయడం మీకు సిగ్గనిపించడం లేదా..? ఇంత కన్నా నీతిమాలిన పని ఏదైనా ఉంటుందా..?' అని శాపనార్థాలు పెట్టడంతో పెయింటర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ళ్లారు.

ముగిసిన సీమ పందుల పెంపకంపై శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశువైద్య సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సీమ పందుల పెంపకంపై ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఇందులో విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి హాజరై శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ పి మంజురి పాల్గొన్నారు.

ప్రతిభలో ఏఐ రోబోటిక్ ఎగ్జిబిషన్



ఏఐ రోబోటిక్ వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్‌లోని ప్రతిభా విద్యాలయలలో శనివారం రోబోటిక్ సంస్థ ఆధ్వర్యంలో ఏఐ రోబోటిక్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ వర్కింగ్ మోడల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం అభివృద్ధి చెందున్న సాంకేతికతను విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బొమ్మి తెలిపారు.

'రామీ గెస్ట్‌లైన్'లో నూతన గదుల ప్రారంభం



గదులను ప్రారంభిస్తున్న ప్రతాప్ స్వామి

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని రామీ గెస్ట్‌లైన్ హోటల్‌లో నూతనంగా నిర్మించిన గదులను శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోటల్ జనరల్ మేనేజర్ వంశీకిరణ్, అడ్మిన్ మేనేజర్ భానుప్రకాష్, అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం సత్యన్న సేన సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఇండియన్ సర్వర్స్ ఫౌండర్ అండ్ సీఈవో సాయిసతీష్ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగే విధానం, అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. మొబైల్‌ను ఎలా హాక్ చేస్తారన్న విషయాన్ని వివరించారు. అనంతరం విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ కాత్యాయిని, డాక్టర్ ఏ లత, సత్యన్న సేన ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, సభ్యులు సుబ్బారెడ్డి, శివారెడ్డి, భాస్కర్, విశ్వ, సోము, జయా, వినోద్, రాజేష్, నరసింహ పాల్గొన్నారు.

అత్యవసర సేవలను సైతం నిలిపేస్తాం



నిరసన తెలుపుతున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాలు చేస్తున్న నిరవధిక నిరసన 13వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా శనివారం వర్సిటీలోని పశువైద్యశాలలో మూడవ రోజు అన్ని రకాల ఓపీలు, ఓటీలను నిలిపేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. యూజీ, పీజీ విద్యార్థులు పశువైద్యశాల ఎదుట పెద్ద సంఖ్యలో బైటాయించారు. వారు మాట్లాడుతూ 13 రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం, వర్సిటీ అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకుంటే రానున్న రోజులలో అత్యవసర సేవలను నిలిపేస్తామని హెచ్చరించారు.

టాటా మోటార్స్ కొత్త వాహనాలు ఆవిష్కరణ



కార్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్: టాటా మోటార్స్ నూతన టియాగో, టీగోర్, ఎలక్ట్రిక్ టియాగో ఈవీ, నెక్సాన్ ఈవీ కార్లను శనివారం తనపల్లి రోడ్డులోని విజయభారతి టాటా మోటార్స్ షోరూంలో ఆర్‌టీవో మురళీమోహన్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఏజీఎం పి.అమరనాథ్‌రెడ్డి, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ శెల్వరాజ్ ఆవిష్కరించారు. షోరూం అధినేత వెంకటరమణ మాట్లాడుతూ టియాగో 26.03 సెంటీమీటర్ల హర్మాన్ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, ఎల్ఈడీ హెడ్ ల్యాంప్‌లు, హెచ్‌డీ రివర్స్ పార్కింగ్ కెమెరా సదుపాయాలు ఉన్నాయన్నారు. టీగోర్, నెక్సాన్‌లలో 360 డిగ్రీల హెచ్‌డీ కెమెరా, స్టీరింగ్ వీల్‌పై ఇలిమినేటెడ్ టాటా లోగోతో ఆకర్షణీయమైన లగ్జరీ ఇంటీరియర్ ఏర్పాటు చేశారని తెలిపారు. నెక్సాన్‌లో రెండు సన్‌రూఫ్ ఆప్షన్స్ ఉన్నాయని, గ్లోబల్ ఎన్‌కాప్ 5 స్టార్ భద్రత, టీయాగో, టీగోర్ గ్లోబల్ ఎన్‌కాప్ 4 స్టార్ భద్రత కలిగి ఉందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, ఎక్ఛేంజ్ సౌకర్యం కూడా ఉందన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో వ్యర్థాలను తొలగిస్తున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ, విద్యార్థులు

తిరుపతి తుడా/తిరుపతి సిటీ : నగరంలోని గిరిపురంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నగరంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పీఏ చంద్రశేఖరన్ , రుయాలో సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి ఆధ్వర్యంలో వ్యర్థా లు తొలగించారు. ఎస్వీయూలో వీసీ సీహెచ్ అప్పారావు, వేదిక్ వర్సిటీలో వీసీ రాణి సదాశివమూర్తి ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి సత్యనారాయణ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి నారాయణమ్మ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేసి వ్యర్థాలు తొలగించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర

తిరుపతి రూరల్ : ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. పెరుమాళ్లపల్లి పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తుమ్మలగుంటలో ప్రతి ఇంటికీ రెండు చెత్త బుట్టలు పంపిణీ చేశారు.



వేదిక్ వర్సిటీలో.. స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న వీసీ, విద్యార్థులు

పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పాకాల : ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆయన శనివారం పాకాల పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌ను పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లకు కొబ్బరి నూనె, పాదరక్షలు, బట్టలు పంపిణీ చేశారు.

ప్రతి ఇంటా కిచెన్ గార్డెన్ ఉండాలి

తిరుపతి రూరల్: ప్రతి ఇంటా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని ఇంటికి కావలసిన కూరగాయలను పండించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ టీఎన్ శోభన్‌బాబు తెలిపారు. ఆయన శనివారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని



ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో...



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మౌర్య

వ్యర్థాల నిర్వహణలో టీటీడీ ఆదర్శం



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు ఈవో, టీటీడీ అధికారులు

తిరుమల: రాబోయే కాలంలో వ్యర్థాల నిర్వహణలో టీటీడీ దేశంలోని ఇతర ఆలయాలకు ఆదర్శంగా నిలుస్తుందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. ఆయన శనివారం టీటీడీ అధికారులతో కలిసి తిరుమలలోని లడ్డూ కౌంటర్ వద్ద స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుమలలో 1,200 మంది సిబ్బంది శుభ్రత కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. తిరుమల డంపింగ్ యార్డులో 2 లక్షల టన్నుల చెత్తను ఎరువుగా మార్చినట్లు తెలిపారు. మరో 40 వేల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను రెండు నెలల్లో పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. తిరుమలలో రోజుకు 78 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త పోగవుతోందన్నారు. ఐవోసీఎల్ ప్లాంట్ ద్వారా జూన్ నుంచి 45 మెట్రిక్ టన్నుల తడి చెత్తతో 1.5 మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి చేసి అన్నప్రసాద కేంద్రంలో వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు.